


VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 97 ఆదివారం 06 సెప్టెంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-

## ప్రతీ కదలికను గమనిస్తున్నాం..

### ఇరాన్ అణు కేంద్రం పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

● ఇరాన్ 'పికాక్స్' అణు స్థావరం పై దాడి చేస్తామని ట్రంప్ హెచ్చరిక ●అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సహించబోమని స్పష్టీకరణ ●నటాంజ్ సమీపంలోని పర్వతం లోపల 'పికాక్స్' భూగర్భ కేంద్రం నిర్మాణం ●గత 5 నెలల సైనిక చర్యలతో ఇరాన్ అణ్వాయుధాన్ని అడ్డుకున్నామన్న ట్రంప్ ●గతంలోనూ పలుమార్లు ఇదే స్థావరం పై హెచ్చరికలు జారీ చేసిన అమెరికా



2లో

## మోదీ మాటల నుంచి స్ఫూర్తి పొందవచ్చు

వార్త సాక్ష్యం :

భారత ప్రధాని నరేంద్ర మోదీ పై బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచం లో అత్యంత స్ఫూర్తిదాయకమైన నేతల్లో ప్రధాని మోదీ ఒకరని పేర్కొన్నారు. మోదీవి హేతుబద్ధమైన ఆలోచనలు అని కీర్తించారు. ఆయన చెప్పిన వాటిని మనం అనుసరించాలని పేర్కొన్నారు. - మిగతా2లో



## రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం

- ఉపాధ్యాయ రంగానికి ఆదర్శంగా నిలిచిన ఆత్మకూరు వాసి వెంకటేశ్వర్లు
- గిరిజన విద్యార్థుల్లో వెలుగు నుంచి ఎంతోమంది జీవితాలకు ఆదర్శం
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు

ఆత్మకూరు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ చేతుల మీదుగా శనివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఆత్మకూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అందుకున్నారు. - మిగతా2లో




## పవన్ కల్యాణ్ ఎఫెక్ట్..

### ఆంధ్రా పేపర్ మిల్లుకు భారీ జరిమానా



2

- ఆంధ్రా పేపర్ మిల్లుకు రూ. 21.01 కోట్ల పర్యావరణ జరిమానా
- కాలుష్య నిబంధనలు తీవ్రంగా ఉల్లంఘిస్తున్నందుకు ప్రభుత్వ చర్యలు
- పవన్ కల్యాణ్ తీవ్ర హెచ్చరికల నేపథ్యంలో జరిమానా విధింపు
- మిల్లుకు రూ. 21.34 కోట్ల పన్ను బకాయిలు ఉన్నట్లు ఆరోపణలు
- యాజమాన్యం తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

## పొన్నం ప్రభాకర్ డిమాండ్

● వెయ్యి రోజులుగా సభకు రాకుండా జీతం తీసుకుంటున్నారని ఆరోపణ ● కేసీఆర్ వైఖరికి నిరసనగా 6న ఇందిరా పార్క్ వద్ద కాంగ్రెస్ మహా ●ధర్నా ధర్నాలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనను వివరిస్తామన్న మంత్రులు ● సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు



2లో

## కేబినెట్ విస్తరణ పై

### మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

● ఢిల్లీ పర్యటనలో విస్తరణ పై చర్చ జరగలేదన్న పీసీసీ చీఫ్ ● కొండా సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమని స్పష్టీకరణ ● కేబినెట్ విస్తరణకు హైకమాండ్ నుంచి సమాచారం లేదని వెల్లడి ● విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం నిర్ణయమన్న మహేశ్

వార్త సాక్ష్యం:

కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు.- మిగతా2లో



## ఏపీలో మున్సిపల్ పోరుకు కొత్త రూల్స్..



వార్త సాక్ష్యం:

ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న బ్యాలెట్ పత్రాల విధానానికి స్వస్తి పలికి, ఇక పై ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎంలు) వాడాలని నిర్ణయించింది. ఓటర్లకు తొలిసారిగా 'నోటా' (నన్ ఆఫ్ ది ఎబౌవ్) ఆప్షన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం నూతన నిబంధనలతో కూడిన మూడు కీలక జీవోలను జారీ చేసింది. డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి ప్రభుత్వం కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. - మిగతా2లో

## లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్



వార్త సాక్ష్యం సెప్టెంబర్ 5 :

సీఎం రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి విరుచుకుపడ్డారు. యువతకు స్కిల్ లేదంటున్న రేవంత్ రెడ్డి ఓటుకు నోటు దొంగ అంటూ వ్యాఖ్యానించారు. యువతకు స్కిల్ లేదంటున్న రేవంత్ రెడ్డి.. ఓటుకు నోటు దొంగ అంటూ వ్యాఖ్యానించారు. 2లో

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR


# రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ చేతుల మీదుగా శనివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఆత్మకూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అందుకున్నారు ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి శాలువలతో పూలమాలతో ఘనంగా సత్కరించి అవార్డును మెమొంటోను అందజేశారు ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు రావడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు నల్లమల అడవి ప్రాంతంలో మారుమూల చెంచు గిరిజన గూడాలలో విద్య బాటలో వెలుగు నింపి నిరుపేద జీవితాలలో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశాలు కల్పించి ఎంతోమందికి ఆత్మకూరు ప్రాంతంలో ఉపాధ్యాయ రంగంలో ఆదర్శంగా నిలిచారు నాకు ఉత్తమ రాష్ట్ర అవార్డు రావడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# పవన్ కల్యాణ్ ఎఫెక్ట్.. ఆంధ్రా పేపర్ మిల్లుకు భారీ జరిమానా

రాజమండ్రిలోని ఆంధ్రా పేపర్ లిమిటెడ్ పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిబంధనలను పదేపదే ఉల్లంఘిస్తూ, పవిత్ర గోదావరి నదిని కలుషితం చేస్తున్నందుకు గాను ఏకంగా రూ. 21.01 కోట్ల భారీ పర్యావరణ జరిమానా విధించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఇటీవలే మిల్లు యాజమాన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన కొన్ని రోజులకే ఈ కఠిన చర్యలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో పవన్ కల్యాణ్ ఆంధ్రా పేపర్ మిల్లు వ్యవహారశైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి నగరంలో వెలువడుతున్న మొత్తం కాలుష్యంలో దాదాపు సగం ఆంధ్రా పేపర్ మిల్లు నుంచే వస్తోందని ఆయన ఆరోపించారు. నగరం నుంచి రోజుకు 70 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు ఉత్పత్తి అవుతుండగా, ఒక్క మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు గోదావరి పరిసరాల్లోకి విడుదలవుతున్నాయని తెలిపారు. మిల్లు నుంచి విడుదలవుతున్న నీటి నమూనాలను పరీక్షించగా, బీఓడీ, ఫాస్ఫేట్లు, సల్ఫైడ్లు వంటి హానికారక రసాయనాలు నిర్దేశిత ప్రమాణాల కన్నా అత్యధికంగా ఉన్నట్లు తేలిందని వివరించారు. ఈ కాలుష్యం వల్ల గోదావరి నదిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాలకు ముప్పు వాటిల్లుతోందని, దుర్వాసనతో ప్రజారోగ్యం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యంతో పాటు పన్ను ఎగవేత అంశాన్ని కూడా పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. 2016 నుంచి సుమారు రూ. 21.34 కోట్ల బకాయిలు చెల్లించలేదని ఆయన తెలిపారు. పన్ను చెల్లింపుల నుంచి తప్పించుకునేందుకు మిల్లు యాజమాన్యం పదేపదే న్యాయస్థానాలను ఆశ్రయిస్తోందని విమర్శించారు. గడిచిన మూడు నెలలుగా పీసీబీ అధికారులు పలుమార్లు సమావేశాలు నిర్వహించినా యాజమాన్యం నుంచి స్పందన కరవైందని తెలిపారు. తక్షణమే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' లక్ష్య సాధనలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని, పద్ధతి మార్చుకోకపోతే మిల్లు కార్యకలాపాలను నిలిపివేయడం, ఆస్తులు జప్తు చేయడం, లైసెన్సు రద్దు వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తొలి విడతగా భారీ జరిమానా విధించింది. ఇకపైనా యాజమాన్యం తీరు మారకపోతే మరింత కఠినమైన చర్యలు ఎదుర్కోక తప్పదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఏపీలో మున్సిపల్ పోరుకు కొత్త రూల్స్..

ఓటర్లకు తొలిసారిగా 'నోటా' (నన్ ఆఫ్ ది ఎబౌవ్) ఆప్షన్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం నూతన నిబంధనలతో కూడిన మూడు కీలక జీవోలను జారీ చేసింది. డిప్యూటీ మేయర్ ఎన్నికకు సంబంధించి ప్రభుత్వం కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. మున్సిపల్ కార్పొరేషన్ తొలి సమావేశం జరిగిన 15 రోజుల్లోగా డిప్యూటీ మేయర్ ఎన్నిక పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఎన్నికకు ఒకరోజు ముందే పార్టీలు తమ కౌన్సిలర్లకు విప్ జారీ చేయాలి. విప్‌ను ధిక్కరించిన వారి సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేస్తారు. ఒకవేళ ఓట్లు సమానంగా వస్తే, లాటరీ ద్వారా విజేతను ప్రకటిస్తారు. ఏదైనా కారణంతో డిప్యూటీ మేయర్ పదవి ఖాళీ అయితే, ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. తాజా నిబంధనల ప్రకారం, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు డిపాజిట్ మొత్తాలను కూడా ఖరారు చేశారు. మేయర్, కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేసే జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.5,000, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.2,500 డిపాజిట్‌గా చెల్లించాలి. అభ్యర్థులు తమ ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు, నేరచరిత్రకు సంబంధించిన వివరాలతో నోటరీ చేసిన అఫిడవిట్‌ను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఒక అభ్యర్థి గరిష్ఠంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ (సవరణ) చట్టం-2026 (యాక్ట్ నం. 22) ఆగస్టు 28 నుంచే అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం జీవో నం. 210లో పేర్కొంది. పోలింగ్ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునేలా ప్రిసైడింగ్ అధికారికి అధికారాలు కల్పించారు. ఇదే సమయంలో, కడప నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజన ప్రక్రియను కూడా ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లను 66కు పెంచుతూ డ్రాఫ్ట్ ప్రతిపాదనలు విడుదల చేసింది. సెప్టెంబర్ 11 వరకు దీనిపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి, సెప్టెంబర్ 14న తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ఈ కొత్త నిబంధనలు, మార్గదర్శకాల ఆధారంగానే రాష్ట్రంలో రానున్న పురపాలక ఎన్నికల ప్రక్రియ జరగనుంది.

# వెయ్యి రోజులుగా రాష్ట్రంలో రాబందు, రాక్షస పాలన సాగుతోంది

శనివారం దుబ్బాక నియోజకవర్గంలోని హబ్సీపూర్ క్రాసింగ్ వద్ద 'రైతు పొలికేక' కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హరీశ్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో పాటు భారీగా రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం నాడు ఈ తరహాలో ఉద్యమించామన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి పుణ్యమా అని నేడు మళ్లీ రోడ్లపైకి వస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ కాస్తా ఐదారు గంటలకు పడిపోయిందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోసం ఎదురు చూసే రోజులు ఉన్నాయా? అని ఈ సందర్భంగా రైతులను ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ చెప్పిన పాత రోజులు మళ్లీ వచ్చాయని చెప్పారు. ఉచిత కరెంట్ కాస్తా ఉత్త కరెంట్ అయిందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాడు కరోనా సమయంలోనూ రైతుబంధు ఆగలేదని హరీశ్ రావు గుర్తు చేశారు. రైతుల మీద కేసీఆర్‌కు ప్రేమ ఉండేదని.. మరి సీఎం రేవంత్ రెడ్డికి ఏమైందని హరీశ్ రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఉన్న రైతుబంధుకు ఎసరు పెట్టారంటూ సీఎం రేవంత్‌పై ఆయన నిప్పులు చెరిగారు. ఈ మూడేళ్లలో రేవంత్ రెడ్డి రూ.29 వేల కోట్ల రైతు బంధు ఎగ్గొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బీమాను బంద్ చేశారని హరీశ్ రావు మండిపడ్డారు. యాప్‌లో బుక్ చేస్తే 15 రోజుల దాకా డీఏపీ ఇవ్వడం లేదన్నారు. షాపులో లేని యూరియా యాప్‌లోకి ఎలా వస్తుందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. యూరియా ధరలను బీజేపీ ప్రభుత్వం పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కాంగ్రెస్, బీజేపీ వాళ్లు రైతుల ఉసురు పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రం ఏ పంట ఎంత కొనుగోలు చేయమంటే.. అంతే కొనుగోలు చేస్తామని సీఎం అంటున్నారన్నారు. ఈ మూడేళ్లలో ఉమ్మడి మెదక్ జిల్లాల్లో ఒక్క ఎకరా భూ సేకరణ చేయలేదని, జానెడు కాలువ కూడా తవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును సీఎం రేవంత్ నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ వద్ద చిన్న మరమ్మతు చేయమంటే.. కూలింది కూలింది అంటూ ఆ ప్రాజెక్టును నిరూపయోగం చేశారని చెప్పారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదని.. రేవంత్ రెడ్డి తెచ్చిన కరవు అని అభివర్ణించారు. మేడిగడ్డ వద్ద 44 వేల క్యూసెక్కుల నీళ్లు పారుతున్నాయని మాజీ మంత్రి వివరించారు.

# లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే

యువతకు స్కిల్ లేదంటున్న రేవంత్ రెడ్డి.. ఓటుకు నోటు దొంగ అంటూ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల మోసాలపై పట్టణం లోని స్థానిక అంబెడ్కర్ స్టేడియం లో బీఆర్ఎస్ చేపట్టిన యువభేరి సభకు కేటీఆర్ హాజరై ప్రసంగించారు. లక్కీ లాటరీ తగిలి రేవంత్ ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. ప్రధాని మోదీని గడగడలాడించిన యువతకు రేవంత్ ఓ లెక్క కాదన్నారు. తెలంగాణ యూత్ డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ నాయకులు పెద్ద పెద్ద మాటలు చెప్పారని.. ఇప్పుడేమైందని ప్రశ్నించారు. జాబులు లేవని నోటిఫికేషన్‌లు లేవన్నారు. లూటిఫికేషన్‌లు మాత్రం బ్రహ్మాండంగా నడుస్తున్నాయని మండి పడ్డారు. వందరోజుల హామీలు నెరవేర్చక వెయ్యిరోజులు అవుతోందని అన్నారు. కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలని కేటీఆర్ ప్రశ్నించారు. 'రాజీనామా ఎవరు చేయాలి.. తెలంగాణ తీసుకొచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, ప్రజలను మోసం చేసిన రేవంత్ రాజీనామా చేయాలా' అని ప్రశ్నించారు. 420 మోసాలకు 420 సార్లు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌తో పెట్టుకోవద్దని హెచ్చరించారు. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని.. ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు ముందున్నాయన్నారు. కమీషన్ల కోసం మంత్రులు కొట్టుకుంటున్నారని దుయ్యబట్టారు. ఉద్యోగాలు ఇస్తామని అడ్డగోలు హామీలు ఇచ్చారని మండిపడ్డారు. రాహుల్ ఎందుకు హైదరాబాద్‌కు రావడం లేదని ప్రశ్నించారు. ఉద్యోగాలపై ఒక్కొక్కరూ ఒక్కో మాట చెబుతున్నారన్నారు. 1000 రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చింది 16 వేల ఉద్యోగాలే అని తెలిపారు. పదేళ్లలో తాము 2.32 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని.. ఉద్యోగాల కల్పనపై చర్చకు కాంగ్రెస్ సిద్ధమా అంటూ కేటీఆర్ సవాల్ విసిరారు.ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువశక్తికి రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు. తనను ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు.మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

## కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

## మోదీ మాటల నుంచి స్ఫూర్తి పొందవచ్చు

మోదీవి హేతుబద్ధమైన ఆలోచనలు అని కీర్తించారు. ఆయన చెప్పిన వాటిని మనం అనుసరించాలని పేర్కొన్నారు. మోదీ వివేకవంతమైన నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. ప్రధాని మోదీ.. తెలివైన నాయకుడని అభివర్ణించారు. శనివారం దేశ ఆర్థిక రాజధాని ముంబై వేదికగా భారత్ - యూరోపియన్ యూనియన్ (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ మాట్లాడుతూ.. భారత్‌లో పర్యటించడం గౌరవంగా ఉందన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో తాను సమావేశమయ్యానని పేర్కొన్నారు. ఆయనతో భేటీ కావడం గౌరవంగా ఉందన్నారు. గతంలో కోవిడ్ కారణంగా తన భారత పర్యటన రద్దయిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలోని పలువురు నాయకులు బెదిరింపు ధోరణిలో మాట్లాడతారని అన్నారు. కానీ భారత ప్రధాని మోదీ మాటలు.. స్ఫూర్తితోపాటు మార్గదర్శకత్వాన్ని అందిస్తాయని చెప్పారు. నరేంద్ర మోదీ మాటలను అనుసరించాలని పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సుంకాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ఎండగట్టారు.

## ప్రతీ కదలికను గమనిస్తున్నాం.. ఇరాన్ అణు కేంద్రం పై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌లోని 'పికాక్స్ మౌంటెన్' అనే భూగర్భ అణుకేంద్రంపై త్వరలోనే దాడి చేసే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఓవల్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడుతూ, "పికాక్స్‌లో ఏదైనా అనుమానాస్పద కార్యకలాపం జరిగితే, మేము దానిపై చాలా త్వరగా దాడి చేయవచ్చు" అని వ్యాఖ్యానించారు. పికాక్స్ అణు కేంద్రంలో ప్రతీ కదలికను అమెరికా నిశితంగా గమనిస్తోందని ట్రంప్ తెలిపారు. "పికాక్స్‌లో ఎవరు కదులుతున్నారో, ఇరాన్ వ్యాప్తంగా ఎవరు ఎక్కడ తిరుగుతున్నారో మాకు తెలుసు. ఏదైనా తప్పు జరిగితే, మేము వారిని గట్టిగా దెబ్బతీస్తాం" అని అన్నారు. గత ఐదు నెలలుగా అమెరికా చేపడుతున్న సైనిక చర్యల వల్లే ఇరాన్ అణ్వాయుధాన్ని పొందకుండా నిరోధించగలిగామని ట్రంప్ పేర్కొన్నారు.

**ఏమిటీ పికాక్స్ పర్వతం?**

ఇరాన్‌లోని నటాంజ్ యురేనియం శుద్ధి కేంద్రానికి సమీపంలో ఒక పర్వతాన్ని తొలిచి భూమికి 80 నుంచి 100 మీటర్ల లోతులో ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. అమెరికా ప్రయోగించే శక్తిమంతమైన బంకర్-బస్టర్ బాంబులు కూడా దీనిని ఛేదించడం కష్టమని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2020 నుంచి దీని నిర్మాణం జరుగుతుండగా, ఇక్కడ సెంట్రిఫ్యూజ్‌లను అసెంబుల్ చేస్తామని ఇరాన్ అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)కు గతంలో వెల్లడించింది.

**పాత హెచ్చరికలే.. కొత్త ఉద్రిక్తతలు**

ట్రంప్ ఈ స్థావరంపై హెచ్చరికలు చేయడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది జులై నుంచే ఆయన 'పికాక్స్' గురించి పదేపదే ప్రస్తావిస్తున్నారు. "మేము పీకాక్స్ మౌంటెన్‌ను కూల్చివేయబోతున్నాం. ఇరానియన్లు సిద్ధంగా ఉండాలి" అని జులైలో వ్యాఖ్యానించారు. వేలాది సెంట్రిఫ్యూజ్‌లను, శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్ ఇక్కడికి తరలించి ఉండొచ్చని ఇజ్రాయెల్ నిఘా వర్గాలు నివేదించినప్పటికీ, అలాంటి సమాచారం తమ వద్ద అధికారికంగా లేదని ట్రంప్ చెప్పడం గమనార్హం. ప్రస్తుతానికి పికాక్స్‌పై అమెరికా దాడి చేయనప్పటికీ, ఉద్రిక్తతలు మాత్రం కొనసాగుతున్నాయి. ఇరాన్‌తో జరుగుతున్నది 'యుద్ధం' కాదని, 'సైనిక ఘర్షణ' అని ట్రంప్ అభివర్ణిస్తున్నారు. మరోవైపు, పీకాక్స్‌లో ఎలాంటి అణు కార్యకలాపాలు జరగడం లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది.

వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR

ఆదివారం 06 సెప్టెంబర్ 2026

## సంపాదకీయం

# అది యుద్ధం కాదట!



ఇరాన్, అమెరికా మధ్య జరుగుతున్నది యుద్ధం కాదట. కనుక, అది ఎప్పుడు ముగుస్తుందో, ఎలా ముగుస్తుందో చెప్పలేమన్నది అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్య సారాంశం. ఏడు నెలలుగా యుద్ధం సాగుతూ, నవంబరులో ఎన్నికలొస్తున్న తరుణంలో జనానికి ఏం చెప్పుకోవాలో తెలియక ట్రంప్ ప్రభుత్వం ఇలా కొత్త నిర్వచనాలు సృష్టిస్తున్నట్టుంది. ఓ నెలపాటు కాస్తోకూస్తో ప్రశాంతత కొనసాగిన తరువాత అమెరికా మళ్ళీ ఇటీవల ప్రళయభీకరంగా ఇరాన్ మీద విరుచుకుపడిన నేపథ్యంలో గురువారం జేడీ వాన్స్ ఈ వ్యాఖ్య చేశారు. ఇరాన్‌తో చర్చలు నిలిచిపోవడం, తిరిగి రాజుకున్న యుద్ధంతో అమెరికాలో డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడం ట్రంప్ రేటింగ్‌లను కుప్పకూలుస్తూ, మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల విజయావకాశాలను ప్రభావితం చేస్తున్నాయి. మూడు రోజులనాటి అమెరికా దాడులు వాన్స్ పరిభాషలో యుద్ధం కాకపోవచ్చు గానీ, కాస్తంత అదుపులో ఉన్న చమురు ధరలు ఈ దెబ్బతో తిరిగి భగ్గుమన్నాయి. దక్షిణ ఇరాన్‌లోని సిరిక్‌లో ఒక పెళ్ళి బృందం మీద అమెరికా విమానాలు జరిపిన దాడిలో అరడజను మంది మరణించారు, ఎనభై మంది తీవ్రంగా గాయపడ్డారు. అప్రదిష్టపాలైన అమెరికా ఈ దాడిమీద దర్యాప్తు జరుపుతుందట. ఈ దారుణఘటన సహా అమెరికా రెండురోజులపాటు 60పైగా స్థావరాలపై జరిపిన దాడులకు ప్రతీకారంగా గల్ఫ్‌లోని దాని మిత్రదేశాలపై ఇరాన్ కూడా విరుచుకుపడింది. శత్రువును ఎంతగా దెబ్బతీశామో ఉభయపక్షాలూ ఎంతో గొప్పగా లెక్కలు విప్పుకున్నాయి కానీ, పశ్చిమాసియా మళ్ళీ ఉద్రిక్తంగా తయారైంది. 'హోర్ముజ్' పూర్తిగా తన నియంత్రణలోనే ఉందనీ, దాని పేరు 'ట్రంప్ జలసంధి'గా మార్చేయాలని అమెరికా అధ్యక్షుడు గొప్పకు పోతున్నారు. హోర్ముజ్‌లో సముద్రంలోని మందుపాతరలను తాకి చమురు ట్యాంకర్లు పేలిపోతున్న వార్తలు కూడా మరోపక్క వింటున్నాం. అమెరికా దాడులు కచ్చితంగా ఒక భయానకమైన, పూర్తిస్థాయి యుద్ధానికి మార్గం సుగమం చేస్తున్నాయి. హోర్ముజ్‌మీద పట్టు, చమురు ధరల నియంత్రణతో గ్లోబల్ మార్కెట్లలో విశ్వాసాన్ని నెలకొల్పడంతోపాటు, అమెరికా ఓటరు మనసు గెలుచుకోవాలని ట్రంప్ ఆశపడుతున్నారు. దీనికి బదులుగా హోర్ముజ్ చేజారలేదని నిరూపిస్తూ మిగతా ప్రపంచంలో అభద్రత, అనుమానాలు కొనసాగేట్టు చేయడం ఇరాన్ లక్ష్యం. ఇరాన్ తన అణ్వాయుధాలను వదిలేసి, యురేనియం శుద్ధిని నిలిపేసి, పశ్చిమాసియాలోని తన ప్రాక్సీలకు ఆయుధాలు అందించడం ఆపేసి, పూర్తిగా చేతులు ఎత్తేసేంతవరకూ యుద్ధం సాగుతూనే ఉంటుందని అమెరికా విదేశాంగమంత్రి చెబుతున్నారు. అణ్వాయుధాలూ లేవు, నిల్వలూ లేవు, మీకు ఓపికున్నంత కాలం చేతనైనది చేసుకోమని ఇరాన్ సవాల్ చేస్తోంది. సముద్రంలో తొమ్మిది నెలలపాటు ఉండిపోయి, తుప్పుపట్టి, తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్న ఐదువేలమంది సైనికులతో అమెరికా యుద్ధనౌక అబ్రహాం లింకన్ మొన్ననే థాయ్‌లాండ్ తీరం చేరింది. అమెరికన్ సైనికులు సేదతీరడానికి వస్తుండటంతో పటాయాలో వ్యభిచార నియంత్రణ చర్యలు చేపట్టినట్టుగా వార్తలు వెలువడ్డాయి. తాజాగా, పశ్చిమాసియాలో దళాల మోహరింపు వచ్చే ఏడాదివరకూ పొడిగిస్తూ అమెరికా రక్షణమంత్రి ఆదేశాలు జారీ చేసినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. యుద్ధం ఆరంభించిన అమెరికా అధ్యక్షుడికి దానిని ఇప్పట్లో ముగించే ఉద్దేశం లేదని అర్థమవుతూనే ఉంది. యాభైవేల మంది అమెరికన్ సైనికులు, పాతిక యుద్ధనౌకలు, డజన్లకొద్దీ యుద్ధవిమానాల మోహరింపుతో ట్రంప్ ఇప్పటివరకూ సాధించిందేమిటో తెలియదు. ఫిబ్రవరిలో ఆరంభమైన 'ఆపరేషన్ ఎపిక్‌ఫ్యూరీ' ట్రంప్ పరిభాషలో చెప్పాలంటే, ఒక స్వల్పకాలిక సైనిక చర్యగా కాక, ఇరాన్ తీవ్రప్రతిఘటనతో యుద్ధంగా మారి ఏడు నెలలుగా సాగుతోంది. అమెరికన్లకూ, మిగతా ప్రపంచానికీ తీవ్రనష్టాన్ని చేకూర్చిన అమెరికా అధ్యక్షుడు వచ్చే ఏడాది కూడా యుద్ధాన్ని కొనసాగించే ఆలోచనతో ఉన్నారన్నది వాన్స్ వ్యాఖ్యల్లోని పరమార్థం.

# జర్నలిస్టుల ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం

**-2025 ఉత్తమ జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం -- 12 విభాగాల్లో పురస్కారాలు**
**-రూ.2 లక్షల నుంచి రూ.1 లక్ష వరకు నగదు పురస్కారాలు -- సెప్టెంబరు 28లోగా దరఖాస్తులు**
**-రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్**

విజయవాడ, సెప్టెంబరు5, వార్త సాక్ష్యం

జర్నలిజం రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పాత్రికేయులను ప్రోత్సహించి, వారి సేవలను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవార్డులకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఆయా విభాగాలకు చెందిన జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హులైన జర్నలిస్టులు తమ దరఖాస్తులను 2026 సెప్టెంబరు 28వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోగా కింది చిరునామాకు పంపించాలని ఆయన సూచించారు.

**-డైరెక్టర్,**
సమాచార పౌరసంబంధాల శాఖ,
2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం,
పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్,
విజయవాడ -- 520013.

**-కమిటీ విచక్షణాధికారంతో ఎంపిక చేసే పురస్కారాలు**

కింది మూడు పురస్కారాలకు జర్నలిస్టుల నుంచి ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించకుండా, ఎంపిక కమిటీ తన విచక్షణాధికారంతో పురస్కార గ్రహీతలను ఎంపిక చేస్తుంది.

1. వి.ఆర్. నార్ల జీవిత సాఫల్య పురస్కారం
2. కొక్కు అహోబలరావు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు
3. మద్దూరి అన్నపూర్ణయ్య పేరిట రాష్ట్రంలోని చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకులకు అందించే అవార్డు

**-దరఖాస్తుల ఆధారంగా కమిటీ ఎంపిక చేసే అవార్డులు**

1. కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ఉత్తమ జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.2 లక్షలు

**-అర్హతలు:**
జర్నలిజం వృత్తిలో కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగి, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన పూర్తికాలపు జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రచురితమవుతున్న పేరొందిన తెలుగు, ఆంగ్ల వార్తాపత్రికలు లేదా పీరియాడికల్స్ కోసం ఆంధ్రప్రదేశ్‌లో లేదా రాష్ట్రం వెలుపల పనిచేస్తున్న జర్నలిస్టులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

2. ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డులు
గ్రామీణ జర్నలిజంలో విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు జర్నలిస్టులకు ప్రముఖ పాత్రికేయుల పేర్లతో మూడు అవార్డులు అందజేస్తారు.
- ఖాసా సుబ్బారావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డు
- ముట్నూరి కృష్ణారావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డు
- మద్దుకూరి చంద్రశేఖరరావు ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డు

ఒక్కో అవార్డు నగదు పురస్కారం: రూ.1 లక్ష

**-అర్హతలు:**
ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రచురితమవుతున్న తెలుగు, ఆంగ్ల దినపత్రికల్లో గ్రామీణ ప్రాంతాల్లో కనీసం 3 సంవత్సరాల అనుభవం కలిగిన పాత్రికేయులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. గ్రామీణ రిపోర్టింగ్‌లో విశేష అనుభవం గడించిన మాజీ జర్నలిస్టులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

3. సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళా జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.1 లక్ష

**-అర్హతలు:**
రాష్ట్రంలో వెలువడే తెలుగు, ఆంగ్ల వార్తాపత్రికలు లేదా పీరియాడికల్స్‌లో పనిచేస్తున్న మహిళా రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

4. ఉత్తమ కార్టూనిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.1 లక్ష

**-అర్హతలు:**
ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రచురితమవుతున్న తెలుగు, ఆంగ్ల దినపత్రికల్లో పనిచేస్తున్న కార్టూనిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి.

5. అబుల్ కలాం ఆజాద్ ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.1 లక్ష

**-అర్హతలు:**
ఉర్దూ పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేస్తూ కనీసం 10 సంవత్సరాల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉర్దూ జర్నలిజానికి అందించిన సేవలు, గ్రామీణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై చేసిన రిపోర్టింగ్, మొత్తం వృత్తిపరమైన పనితీరును ప్రామాణికంగా తీసుకుని అవార్డు గ్రహీతను ఎంపిక చేస్తారు.

6. ఉత్తమ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.1 లక్ష

**-అర్హతలు:**
కనీసం 5 సంవత్సరాల అనుభవం కలిగి, ఆంధ్రప్రదేశ్‌లో ప్రసారమయ్యే ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లలో పనిచేస్తున్న జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చు. దూరదర్శన్, రేడియోలో పనిచేస్తున్న జర్నలిస్టులు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

7. ఉత్తమ వీడియో జర్నలిస్టు అవార్డు
నగదు పురస్కారం: రూ.1 లక్ష

**-అర్హతలు:**
కనీసం 5 సంవత్సరాల అనుభవం కలిగి, ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లలో పనిచేస్తున్న వీడియో జర్నలిస్టులు దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు విధానం -- ముఖ్య నిబంధనలు

-జర్నలిస్టులు తాము పనిచేస్తున్న సంస్థ, ఉద్యోగ వివరాలు, తమ అర్హతలకు సంబంధించిన పూర్తి వివరాలతో వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలి.

-దరఖాస్తుతో పాటు కనీసం 5 వ్యాసాలు, వార్తా కథనాలు, ఫొటోలు, కార్టూన్లు లేదా వీడియో క్లిప్పింగ్స్ జతచేయాలి. అవి 2025 క్యాలెండర్ సంవత్సరంలో (01-01-2025 నుంచి 31-12-2025 వరకు) ప్రచురితమైనవి/ప్రసారమైనవి అయి ఉండాలి.

-వ్యాసాలు, వార్తా కథనాలు తదితర ఆర్టికల్స్‌ను ఫొటోకాపీల రూపంలో కూడా దాఖలు చేయవచ్చు.

-అవార్డు గ్రహీతల ఎంపికకు సంబంధించి ఎంపిక కమిటీదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు అనుమతించబడవు.

-ఏదైనా విభాగంలో తగిన సంఖ్యలో లేదా తగిన ప్రమాణాలతో దరఖాస్తులు అందలేదని కమిటీ భావించినట్లయితే, సంబంధిత అవార్డును ప్రకటించకుండా నిలిపివేసే అధికారం ఎంపిక కమిటీకి ఉంటుంది.

-ఉత్తమ జర్నలిస్టు పురస్కారాలకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలోని మీడియా రిలేషన్స్ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చు: (https://mediarelations.ap.gov.in/meda)

# సుంకేసుల నిర్వాసితుల కష్టాలు పట్టించుకోని అధికారులు









MLA తో అడ్వకేట్ కోడి మోహన్ రావు

**-నిలువ నీడ లేదు.. ప్యాకేజీ డబ్బులు రావు.. కొందరికి ఆనందం.. మరికొందరికి ఆవేదన**
**-ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన సుంకేసుల వాసులకు అండగా ఎమ్మెల్యే చంద్రశేఖర్**

పెద్ద దోర్నాల సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

వెలిగొండ ప్రాజెక్టు కోసం సుంకేసుల గ్రామాన్ని ఖాళీ చేసి సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితుల కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ ఇళ్లు, భూములు వదులుకున్న నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం, పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకవైపు నిలువ నీడ లేక.. మరోవైపు ప్యాకేజీ డబ్బులు అందక కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని న్యాయవాది కోడి మోహన్ రావు తెలియజేశారు. ప్యాకేజీ విషయంలో కొందరికి పరిహారం అందడంతో ఆనందం నెలకొనగా, ఇంకా పరిహారం అందని కుటుంబాల్లో మాత్రం తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తమవుతోంది. ఏళ్ల తరబడి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పరిష్కారం లభించడం లేదని నిర్వాసితులు వాపోతున్నారు. ప్రాజెక్టు కోసం తమ సొంత ఊరినే త్యాగం చేసిన సుంకేసుల వాసులకు న్యాయం ఎప్పుడు జరుగుతుందోనని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అర్హులైన ప్రతి నిర్వాసిత కుటుంబానికి ప్యాకేజీ, పునరావాస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

**-నిర్వాసితులకు ఎమ్మెల్యే అండ**

ఇదిలా ఉండగా, కష్టాల్లో ఉన్న సుంకేసుల నిర్వాసితులకు యర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్ అండగా నిలుస్తున్నారు. నిర్వాసితుల పరిస్థితిని గుర్తించి వారికి నిత్యం ఆహారం అందిస్తూ మానవతా దృక్పథంతో సహాయం చేస్తున్నారని స్థానికులు తెలిపారు. తమ కష్టకాలంలో అండగా నిలుస్తున్న ఎమ్మెల్యేకు నిర్వాసితులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం కూడా ఎమ్మెల్యే తరహాలో నిర్వాసితుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి, ప్యాకేజీ బకాయిలు వెంటనే చెల్లించి, ప్రతి కుటుంబానికి నిలువ నీడ కల్పించాలని న్యాయవాది కోడిమోహన్రావు జిల్లా ఉన్నత అధికారులకు నిర్వాసితుల తరపున విజ్ఞప్తి చేస్తున్నారు

VARTHAA SAKSHAMU
RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# విద్యే బాలికల భవిష్యత్తుకు బంగారు బాట- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి











**- కస్తూరిబా బాలికల విద్య, భద్రతకు ఎన్డీయే ప్రభుత్వం పెద్దపీట.**

**-ఆత్మకూరు, బండి ఆత్మకూరు కస్తూరిబా పాఠశాలలో వసతి గృహాలు ప్రారంభించిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి**

ఆత్మకూరు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి, మెరుగైన సౌకర్యాలు అందించడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. విద్య ద్వారానే బాలికల భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని ఆయన పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు పట్టణంలో రూ. 1.60 కోట్లు, బండి ఆత్మకూరులో రూ. 1.63 కోట్ల వ్యయంతో కస్తూరిబా బాలికల జూనియర్ కళాశాలల్లో నిర్మించిన నూతన వసతి గృహాలను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి వసతి గృహంలో వారికి అందుతున్న సౌకర్యాలు, భోజన వసతి, తాగునీరు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

**-బాలికల విద్యకు ఎన్డీయే ప్రభుత్వం అండ**

ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా తల్లిదండ్రులకు ఆర్థికంగా చేయూత అందిస్తున్నామని, 'సర్వేపల్లి రాధాకృష్ణ కిట్' ద్వారా విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్, దుస్తులు, షూ, బెల్ట్ తదితర సామగ్రిని అందిస్తున్నామని చెప్పారు. కస్తూరిబా బాలికల వసతి గృహాల్లో విద్యార్థినులకు మరింత మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు.

**-అదనపు సౌకర్యాలకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హామీ**

ఆత్మకూరు, బండి ఆత్మకూరు కస్తూరిబా బాలికల జూనియర్ కళాశాలల్లో ఇన్వర్టర్ సౌకర్యం, తాగునీటి వసతి, మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి హామీ ఇచ్చారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యార్థినుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

**-ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యారంగానికి ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేస్తూ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. అనంతరం యం.ఈ.ఓ మేరీ మార్గరెట్, యం.ఈ.ఓ-2 ఆయుబ్ మహమ్మద్లను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి పార్టీ సీనియర్ నాయకులు కంచర్ల గోవిందరెడ్డి, టిడిపి మండల మాజీ అధ్యక్షుడు శివ ప్రసాద్ రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం బిజెపి పార్టీ కార్యవర్గ సభ్యురాలు ఇంచార్జి మోమిన్ షబానా, ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్, ఏ. షాహావుద్దీన్, రాష్ట్ర మైనార్టీ టిడిపి సీనియర్ నాయకుడు పఠాన్ నాగూర్ ఖాన్, కోయ హోటల్ మున్నా, టిడిపి పట్టణ అధ్యక్షుడు, జెట్టి వేణుగోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం భాష, మండల అధ్యక్షుడు రవీంద్రబాబు, జనసేన పార్టీ నాయకులు శ్రీరాములు టిడిపి నాయకులు రాజేంద్రా రెడ్డి, మోటార్ షఫీవుల, అమృల్ల, సుల్తాన్, దినకర్ రావు విఆర్ఎస్పి ప్రాజెక్టు చైర్మన్ పోచ మల్లికార్జున్ రెడ్డి, మండల తాసిల్దార్ రత్న రాధిక, మండల విద్యాశాఖ అధికారి మేరీ మార్గెట్, విద్యాశాఖ అధికారి ఆయుబ్ మరియు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు టిడిపి నాయకులు కార్యకర్తలు కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ పార్టీ కార్యాలయంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు





ఆత్మకూరు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ ఆత్మకూరు డివిజన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సభ అధ్యక్షత వహించిన ప్యారం.శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ గారి చిత్రపటానికి పూలమాలవేసి నమస్కరించుకున్నారు అనంతరం సీనియర్ ఉపాధ్యాయులు షాబోలు చిన్న లింగన్న, బి. రాంబాలజీ నాయక్, ఎస్.శేఖర్ నాయక్, సి రవీంద్రనాథ్ కూ శ్యాలువ, పూలమాలలు వేసి మేమంటోతా సత్కరించారు. అనంతరం సిపిఐ, ఏఐటీయూసీ, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అంటే కేవలం చదువు చెప్పడమే కాదు విద్యార్థినీ, విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు అహర్నిశలు కష్టపడే వారే ఉపాధ్యాయులను అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్, ఏఐటియుసి నాయకులు దూద్ పీరా, బిసన్న, చాంద్ భాషా, ఎస్ టి యు ఏపీ నంద్యాల జిల్లా కార్యవర్గ సభ్యులు డి.వీ చంద్రకుమార్,టి. విజయ్ కుమార్ ఆత్మకూరు మండల శాఖ అధ్యక్షులు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి బాలాజీ, మురహరి. రాజ్ కుమార్, చిన్న దర్గయ్య, మక్బుల్,మబ్బాషా పేరయ్య, కొత్తపల్లి మండల అధ్యక్షుడు మరియు శాఖ సభ్యులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కృషి





**-ప్రజల తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు**

ఆత్మకూరు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

పురపాలక సంఘంలో ఎదురవుతున్న మంచినీటి ఎద్దడికి పరిష్కారంగా శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు సంత మార్కెట్ సమీపంలో నూతనంగా బోరుని తవ్వి ంచారు. ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ బోర్ ద్వారా సేకరించిన నీటిని సమీపంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌కు ఎక్కించి, తద్వారా 11వ వార్డు పరిధిలోని ఇళ్లకు నిరంతరం మంచినీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టనున్నారు. తెలుగుదేశం పార్టీ 11వ వార్డు ఇంచార్జ్ అమ్రుల్లా పర్యవేక్షణలో నాయకులు, సమక్షంలో నిర్వహిం చారు. తాగునీటి సమస్య తీర్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డికి, పార్టీ నాయకులకు ఈ సందర్భంగా వార్డు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## కులాల వారీగా ఓటర్ వాలిడేషన్ పూర్తి. స్వాతి



వెలుగోడు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

వెలుగోడు పట్టణంలో కులాలవారీగా ఓటరు వాలిడేషన్ పూర్తయినట్లు గ్రామ కార్యదర్శి ఇర్ఫాన్ తెలియజేశారు. ఒకటో సచివాలయం నందు స్పెషలాఫీసర్ స్వాతి అధ్యక్షతన శనివారము గ్రామసభ ద్వారా ఓటర్ జాబితా వాలిడేషన్ జరిగింది. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ వెలుగోడు పట్టణాన్ని 20 వార్డులుగా విభజించి 40 బూతులుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కొక్క బూతులో 1092 ఓటర్లు ఉంటారని తెలిపారు. వెలుగోడు పట్టణంలో ఎస్టి ఓటర్లు 809, ఎస్సీ ఓటర్లు 2392 , బిసి ఓటర్లు 14,866 , ఓసి ఓటర్లు 3775 ,మొత్తము ఓటర్లు 21, 842 మంది ఉన్నట్లు కార్యదర్శి చెప్పారు. సమావేశంలో పాల్గొన్న అన్ని పార్టీల నాయకులను ఓటర్ జాబితాలోని అభ్యంతరాలు పై వివరణ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మండ్ల శంకర్ రెడ్డి, ఖలీల్ ఖాన్, వైఎస్ఆర్సిపి నాయకులు ఇలియాస్ ఖాన్ , అచ్చయ్య రమణ, జనసేన నాయకులు షాలు భాష, తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశంలోని రుగ్మతలపై పోరాడిన మహాత్మా పూలే పుణ్య దంపతులు



పెద్ద దోర్నాల సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

భారతదేశంలో శతాబ్దాలుగా కొనసాగిన కులవివక్ష, అంటరానితనం, స్త్రీలపై వివక్ష, మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే పుణ్య దంపతులని న్యాయవాది కోడి మోహన్ రావు తెలియజేశారు.సమాజంలో అణగారిన వర్గాలకు విద్య అందితేనే వారి జీవితాల్లో నిజమైన మార్పు వస్తుందని జ్యోతిరావు పూలే నమ్మారు. ఆ ఆలోచనకు సావిత్రిబాయి పూలే అండగా నిలిచి, మహిళల విద్య కోసం ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారు. బాలికల కోసం పాఠశాలలను ప్రారంభించి, విద్యకు దూరంగా ఉన్న మహిళలకు అక్షరజ్ఞానం అందించారు.ఆ కాలంలో బాల్యవివాహాలు, వితంతువుల దుస్థితి, కుల వివక్ష తీవ్రంగా ఉండేవి. వీటిని ప్రశ్నిస్తూ పూలే దంపతులు సమానత్వం, మానవత్వం, విద్య, స్వేచ్ఛ కోసం ఉద్యమించారు. వితంతువులకు అండగా నిలవడంతో పాటు, అనాథలు, అణగారిన వర్గాల పిల్లల కోసం సేవా కార్యక్రమాలు చేపట్టారు "విద్యే విముక్తికి మార్గం" అనే భావనను సమాజంలో బలంగా నాటిన పూలే దంపతుల కృషి భారత సామాజిక సంస్కరణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. వారి ఆలోచనలు తరువాతి తరాల సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తిగా మారాయి.నేటికీ కుల వివక్ష, లింగ అసమానత, మూఢనమ్మకాలు, సామాజిక అసమానతలు పూర్తిగా తొలగిపోలేదు. అందువల్ల పూలే దంపతుల ఆశయాలను ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. సమానత్వం, విద్య, స్వాభిమానం, మానవత్వం ఆధారంగా సమాజాన్ని నిర్మించడమే వారికి ఇచ్చే నిజమైన నివాళి న్యాయవాది కోడి మోహన్ రావు కొనియాడారు ప్రస్తుత యువత పూలే అంబేద్కర్ ఆలోచన విధానం అనుచరించాలని తెలియజేశారు.

## కార్యకర్తకు ఎమ్మెల్యే భరోసా

బాపట్లసెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం



అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్తకు బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అండగా నిలిచారు.

బాపట్ల పట్టణం 26వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకుడు, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ చాపా సోమయ్య అనారోగ్యంతో చీరాలలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ వెంటనే స్పందించారు.ఆసుపత్రికి స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే.. చికిత్స పొందుతున్న సోమయ్యను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమయ్యకు అందుతున్న వైద్యంపై వైద్యులతో మాట్లాడి, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. సోమయ్య త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో వారికి అండగా నిలుస్తూ ధైర్యం కల్పించడంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ చూపుతున్న చొరవ పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం గ్రామాల్లో బిజెపి బలోపేతం

-మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్
-స్థానిక సంస్థల ఎన్నికలకు బిజెపి ఇప్పటి నుంచే సన్నద్ధం
-యువతను బిజెపిలోకి ఆహ్వానించి, పార్టీని మరింత బలోపేతం చేస్తాం



పాములపాడు,సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం




ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామాల్లో బిజెపి బలోపేతం చేస్తామని మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అభిరుచి మధు సూచనల మేరకు శనివారం మండల కేంద్రంలోని, బిజెపి కార్యాలయంలో మండల పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసి, బిజెపి జెండాను రెపరెపలాడేలా కృషి చేస్తామని తెలిపారు. కేంద్ర సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి స్థానంలో బిజెపి అభ్యర్థి పోటీ చేసేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని నాయకులకు సూచించారు. ముఖ్యంగా పార్టీపై ఆసక్తి ఉన్న యువతను బిజెపి లోకి తీసుకురావాలని, స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. బిజెపి కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. మండల పదాధికారులు ప్రజలతో నిరంతరం మమేకమై, గ్రామాల్లోని ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పార్టీ నాయకుల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, ప్రతి గ్రామంలో బిజెపికి బలమైన కార్యకర్తల బృందాన్ని ఏర్పాటు చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పదాధికారులు ప్రవీణ్ కుమార్, గోపాలకృష్ణయ్య, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, మంగలి వెంకటేశ్వర్లు, ఇమ్రాన్ భాష, ఎస్.కె.ఖాజా వలి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఐఈఆర్టీ అవార్డు అందుకున్న షంషుద్దీన్



వెలుగోడు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని నంద్యాల కలెక్టరేట్ పి.జి. ఆర్. ఎస్. ఆడిటోరియంలో శనివారం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రధానోత్సవం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వెలుగోడు పట్టణానికి చెందిన కె. షంషుద్దీన్ జిల్లా ఉత్తమ ఐఈఆర్టీ అవార్డుకు ఎన్నికై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గనియ, రాష్ట్ర మంత్రివర్యులు ఎన్.ఎండి. ఫారూక్, డీఈవో జనార్ధన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు ప్రస్తుతం ఆయన పాములపాడు మండలంలో ఐఈఆర్టీగా విధులు నిర్వహిస్తున్నారు. షంషుద్దీన్ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందిస్తున్న విశిష్ట సేవలకు గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు. వెలుగోడు పట్టణ వాసికి జిల్లా స్థాయిలో గుర్తింపు రావడం పట్ల వెలుగోడు పట్టణ ప్రజలు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్, ఐ.ఈ. కోఆర్డినేటర్ జగన్మోహన్ రెడ్డి, అలెస్కో కోఆర్డినేటర్ ప్రసన్న కుమార్, ఏఎంవో మాధవి, వివిధ మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.అవార్డు అందుకున్న షంషుద్దీన్ ను ఉపాధ్యాయులు, పాత్రికేయులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

## సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక గౌరవం:ఎపిటిఫ్

ఆత్మకూరు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం




భావి భారత పౌరులు భవిష్యత్తును తీర్చిదిద్దడం లో డాక్టర్ సర్వేపల్లి రాధా కిషన్ ఆశయాలను కొనసాగిద్దాం ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులు . ఉమ్మర్ అన్నారు, శనివారం పట్టణంలోని ఏపిటిఎఫ్, ఆత్మకూరు డివిజన్ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం జరిగిందని అన్నారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు గాని, దేశ భవిష్యత్తు తరగతుల గదులలోనే నిర్మించబడుతుంది, అన్ని వృత్తుల వెనుక ఉపాధ్యాయుడు ఉంటాడు. ప్రతి వ్యక్తి తన తల్లిదండ్రుల తరువాత గురువు నే ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఒక ఉన్నత స్థాయి కి చేరుకుంటాడు. ప్రస్తుతం విద్యా రంగంలో కృత్రిమ మేధస్సు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి పాటలు బోధించే ప్రయత్నం జరుగుతున్నది. కాని ఏఐ ఉపాధ్యాయునికీ ప్రత్యామ్నాయశీ కాదు అతని చేతిలో ఒక శక్తివంతమైన సాధనం, సాంకేతిక విద్యకు మానవత్వం వైపు నడిపించు వారు గురువు. సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవప్రదమైనది కావున ఉపాధ్యాయులు మనమందరం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుదాం అన్నారు, ఈ కార్యక్రమంలో ఏపీటీ ఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు ఆరిఫ్ బాషా. శ్రీనివాసులు,. ఇక్బాల్ బాషా, సీనియర్ నాయకులు ,. అబ్దుల్ వహీద్, రషీద్, జిల్లా కౌన్సిలర్లు గురు స్వామి. చిన్నా కృష్ణయ్య, ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, మండల అధ్యక్షులు అంబయ్య,. వెంకటరమణ, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదిత రులు పాల్గొన్నారు

## సమాజ అభివృద్ధికి పత్రికలే కీలకము ప్రజా సంఘాల నాయకులు





ఆత్మకూరు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

సీనియర్ పాత్రికేయులు హనుమంతు నాలుగో వర్ధంతి సందర్భంగా డాక్టర్ ఏ. ధనుంజయ మీటింగ్ హాల్ నందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో, పాత్రికేయుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు హనుమంతు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఏ. రణధీర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసు రత్నం, సీనియర్ పాత్రికేయులు శీలం శేషు, పాత్రికేయులు కేశవులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం నరసింహ నాయక్, సీనియర్ పాత్రికేయులు జోసెఫ్ చంద్రశేఖర్ లు మాట్లాడుతూ హనుమంతు బ్యాట్మెంటన్ ప్లేయర్ గా గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎదిగి ఒక గుర్తింపు పొందిన వ్యక్తి అని అదే క్రమంలో కుల వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం తాలూకా ఉపాధ్యక్షులుగా పనిచేస్తూ మరోవైపు పాత్రికేయులుగా ఉంటూ సమాజంలో సమస్యలను వెలికితీస్తూ వాటి పరిష్కారం కొరకు అధికారులు నాయకులు ప్రజా ప్రతినిధులకు సమస్యల పరిష్కారం కొరకు ఒక వారదిగా నిలిచేవారని అన్నారు ఆత్మకూరు నందికొట్కూరు తాలుకాలలో ప్రజాశక్తి దినపత్రిక నడప డంలో అదేవిధంగా వారి దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించే వారిని అధ్యకాకుండా డివైఎఫ్ఐ లో పనిచేస్తూ లింగాల గ్రామ ఉపసర్పంచ్ గా పని చేశారు. ఈ క్రమంలోనే ప్రజలు ఎదుర్కొంటు న్నటువంటి సమస్యల పైన ఒకవైపు పోరాటాలు చేస్తూ మరోవైపు ప్రజాశక్తి దినపత్రికను రోజురోజుకు అభివృద్ధి చేసే దానికి తీవ్రమైన కృషి చేసినటువంటి వ్యక్తి అని అన్నారు. అధికారులతోటి ప్రజా ప్రతినిధులతోటి నాయకులతోటి సన్నిహిత సంబం ధాలు కలిగి ఉండేవారని అన్నారు. వారు మృతి ప్రజాసంఘాల అభివృద్ధికి ప్రజాశక్తికి తీరంలోటని వారు అన్నారు.. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు చంద్ర శివప్ప మల్లయ్య రవి చంద్ర స్వాములు ప్రజా సంఘాల నాయకులు డేవిడ్ వెంకటేశ్వరరావు, చిన్న మారన్న,రామ్ నాయక్,వీరన్న, రామ్ నాయక్ వీరంగం దినేష్, సాయి, మా భాష, మోహన్, మురళి, తదితరులు పాల్గొన్నారు

## పుల్లారెడ్డి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ఆత్మకూరు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం



పట్టణంలోని జి పుల్లారెడ్డి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికిపాఠశాల డైరెక్టర్ గోపిశెట్టి సాయి ప్రణీత్ ముఖ్యఅతిథిగా హాజరై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువు యొక్క ప్రాముఖ్యతను, గురుపూజోత్సవం గురించి వివరించారు. అంతేగాక మన దేశానికి రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి ఆయన రాష్ట్రపతిగా ఏదిగిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన పట్టుదల కృషి వల్లనే అంతటి మహోన్నతమైన పదవులను అలంకరించారని, ఆయన మన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులందరికీ దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ చాంద్ భాష భాష పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతకు ఆలయాలే ఆధారం

చీరాల సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం



చీరాల నియోజకవర్గంలో పల్లె ప్రాంతాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. ప్రజల భక్తి విశ్వాసాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి తాను నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. చల్లారెడ్డిపాలెం బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించనున్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి శనివారం భక్తిశ్రద్ధల మధ్య శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన ఆలయ నిర్మాణానికి తొలి శంకువును ప్రతిష్ఠించి భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ.. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా ప్రజలను ఐక్యంగా నిలిపే వేదికలుగా కూడా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పల్లెటూళ్లలో ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి, ఆధ్యాత్మిక చింతనతో పాటు సామాజిక స్ఫూర్తి పెంపొందుతుందని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తూ నిరంతరం పనిచేస్తానని తెలిపారు. శంకుస్థాపన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిoచారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక ప్రజలు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు .ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో స్థానికుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. నూతన ఆలయం త్వరగా పూర్తై భక్తులకు అందుబాటులోకి రావాలని పలువురు ఆకాంక్షించారు.

# నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో కేసీ కెనాల్ కు నీటి విడుదల









నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

నందికొట్కూరు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

జిల్లాలోని నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలం ముచ్చుమర్రి ఎత్తిపోతల, మల్యాల ఎత్తిపోతల పథకం ల నుంచి కర్నూలు – కడప (కేసీ కెనాల్ ) కు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, టీడీపీ లోక్ సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఆదేశాల మేరకు నీటి విడుదల చేసినట్లు ముచ్చుమర్రి టీడీపీ నాయకులు కాటం వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అనుచరులు, ముచ్చుమర్రి గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు కాటం. వెంకటరామిరెడ్డి, ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్మరి. నాగరాజుల, ముచ్చుమర్రి మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ నాగభూషణం, సుబ్బారావు, బాల నారాయణ, ఆంజనేయ నగర్ రవి ఆధ్వర్యంలో సుమారు 100 మందికి పైగా జనం తరలిరావడంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద కృష్ణమ్మకు కుంకుమ, పసుపు, గాజులు, వడిబియ్యం కొత్త చాటలో పెట్టి సారే సమర్పించి, కృష్ణమ్మ జలహారతి ఇచ్చి కేసీ కెనాల్ కు నీటి విడుదల చేశారు. కేసి కెనాల్ డి ఈ ఈ ప్రసాద్, ఏ ఈ ఈ లు వీరమ్మ, శ్రీనివాస నాయక్ లు మాట్లాడుతూ శనివారం ఉదయం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి నీటి విడుదలకు ఉన్నతాధికారులు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి రెండు మోటార్ల ద్వారా 480 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల పథకం ఒక మోటారు ద్వారా 325 క్యూసెక్కుల నీరు, మొత్తం 805 క్యూసెక్కుల నీరు కర్నూలు- కడప (కేసీ కెనాల్) కు విడుదల చేయడం జరిగిందన్నారు. కేసీ కెనాల్ కు వదిలిన నీరు కేవలం తాగునీటి అవసరాలకే అన్నది మరువవద్దని, ఇరిగేషన్ ఉన్నతాధికారులు కూడా తాగునీటి అవసరాలకే కేసీ కెనాల్ కు నీటి విడుదలకు ఆదేశించినట్లు కేసీ కెనాల్ డి ఈ ఈ ప్రసాద్ స్పష్టం చేశారు.

# నంద్యాల క్రాంతినగర్ లో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు







నంద్యాల సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

నంద్యాల పట్టణం, క్రాంతినగర్ లో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం నందు గత ఐదురోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం ముగిశాయి. ప్రముఖ వ్యాఖ్యాత ఉపన్యాసకులు డాక్టర్ దీవి హయగ్రీ వాచార్యులుచే శ్రీమద్రామాయణం, మహాభారతం, భాగవతాలపై ధార్మిక ప్రవచనాలు, ప్రతిరోజు బాలనాగిరెడ్డి బృందం చే భజనలు, ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక అర్చకులు వై. సి. సంగీత్ కుమార్ భక్తులందరితో సామూహిక కుంకుమార్చనలు, గోమాతకు పూజలు చేయించారు. ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలనుకున్న వారికి తి. తి. దే. సహకరిస్తుందని తి. తి. దే. హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.వెంకటే శ్వర రెడ్డి, మిట్టా వెంకటేశ్వరరెడ్డి, శివారెడ్డి, అంగడి సుబ్బారెడ్డి, జి. చెన్నారెడ్డి, జి. చెన్నారెడ్డి, వెంకటసు బ్బారెడ్డి, లక్ష్మి, స్వప్న, కృష్ణకుమారి, పక్కీరమ్మా, ప్రమీల, రమాదేవి, కుమారి, తులశమ్మతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలే తొలి ప్రాధాన్యం

-ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు..



చుండూరు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు చొరవ చూపారు. చుండూరు మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన 'మీకోసం (PGRS)' ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, తాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాలు, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన వినతిపత్రాలను నక్కా ఆనంద్ బాబు స్వయంగా స్వీకరించి పరిశీలించారు. సమస్యల తీవ్రతను తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే చర్చిం చారు. అర్హులైన ప్రజల సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించేందుకు 'మీకోసం' కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ప్రజల కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఓటరుగా నమోదు తప్పనిసరి

రెంటచింతలసెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం



18 ఏళ్లు నిండిన ప్రతి వయోజనుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని రెంటచింతల తహశీల్దార్ మర్రి దీప్తి సూచించారు. శనివారం మండల పరిధిలోని జెట్టిపాలెం గ్రామంలో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. ఓటరు సర్వేలో భాగంగా మండలంలో ఇప్పటివరకు 6,331 మందికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు కేవలం 408 మంది మాత్రమే స్పందించారని, మిగిలిన వారు కూడా వెంటనే స్పందించి ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఓటు ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్వో మరి యదాసు, బూత్ లెవెల్ అధికారులు (బీఎల్వోలు), విలేజ్ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డీపాల్ హైస్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు











-విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

ఆత్మకూరు సెప్టెంబర్ 5 వార్త సాక్ష్యం

మండల పరిధిలోని కరివేన గ్రామంలోని డీపాల్ హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు ఆర్డీవో వెంకటశివ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్డీవో వెంకట శివ మాట్లాడుతూ... సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు, వారి విశిష్టత, గొప్పతనం, ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీపాల్ హైస్కూల్ ఫాదర్ సీన్స్, ఫాదర్ శాంటో, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 06 సెప్టెంబర్ 2026

# బిజినెస్

## జాగ్వార్ ల్యాండ్ రోవర్‌లో ఉద్యోగాల కోత- 4 వేల మందికి ఉద్వాసన!



ప్రముఖ వాహన దిగ్గజం టాటా మోటార్స్ అనుబంధ సంస్థ, లగ్జరీ కార్ల బ్రాండ్ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) భారీ స్థాయిలో ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోందని తెలుస్తోంది. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా రాబోయే రెండేళ్లలో బ్రిటన్‌లో సుమారు నాలుగు వేల మంది ఉద్యోగులను తొలగించాలని కంపెనీ యోచిస్తున్నట్లు సమాచారం. అమెరికా విధించిన టారిఫ్‌లు, పెరుగుతున్న వాహన తయారీ వ్యయం, అంతర్జాతీయంగా తగ్గుతున్న అమ్మకాలు వంటి కారణాల రీత్యా కంపెనీ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు చైనా నుంచి ఎదురవుతున్న తీవ్ర పోటీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అవుతున్న భారీ ఖర్చులు, అంతర్జాతీయ ఆంక్షల ప్రభావం జేఎల్ఆర్‌పై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఈ ఏడాది జూన్ చివరి నాటికి కంపెనీ ఆదాయం దాదాపు 10 శాతం మేర క్షీణించడమే ఇందుకు నిదర్శనం. ఉద్యోగాల కోతకు సంబంధించిన సమాచారాన్ని యాజమాన్యం ఇప్పటికే అంతర్గతంగా సిబ్బందికి చేరవేసినట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఈ తొలగింపుల ప్రభావం ప్రధానంగా మేనేజ్‌మెంట్ బృందాలు, నెలవారీ వేతన సిబ్బందిపై పడనుంది. ప్రస్తుతం బ్రిటన్‌లో జేఎల్ఆర్ సుమారు 34,000 మందికి ఉపాధి కల్పిస్తోంది.

## అందుబాటు ధరలో రాయల్ ఎన్‌ఫీల్డ్ కొత్త అడ్వెంచర్ బైక్ హిమాలయన్ 440 వచ్చేసింది!

అడ్వెంచర్ బైక్ కొనాలనుకునేవారికి రాయల్ ఎన్‌ఫీల్డ్ గుడ్‌న్యూస్ చెప్పింది. సంస్థ కొత్తగా హిమాలయన్ 440ను భారత మార్కెట్లోకి తీసుకొచ్చింది. రూ.2.29 లక్షల ఎక్స్‌షోరూమ్ ధరతో దీన్ని విడుదల చేసింది. హిమాలయన్ 450 కంటే తక్కువ ధరలో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ మోడల్.. హిమాలయన్ పేరుతో రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రయాణానికి పదేళ్లు పూర్తయిన సందర్భంగా విడుదలైంది. కొత్త హిమాలయన్ 440లో 443 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఉంది. ఇది 25.4 బీహెచ్‌పీ శక్తిని, 34 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇంజిన్‌కు ఆరు గేర్ల గేర్‌బాక్స్‌ను జత చేశారు. పాత హిమాలయన్‌లో ఉన్న ఐదు గేర్లకు బదులుగా ఇది వచ్చింది. ఇంజిన్‌లో శబ్దం, వైబ్రేషన్లు తగ్గించేలా మార్పులు చేసినట్లు కంపెనీ తెలిపింది. బైక్‌లో హాఫ్ డ్యూప్లెక్స్ స్ప్లిట్ క్రేడిల్ ఫ్రేమ్‌ను ఉపయోగించారు. ముందు 41 మిల్లీమీటర్ల టెలిస్కోపిక్ ఫోర్కులు ఉన్నాయి. ఇవి 200 మిల్లీమీటర్ల ట్రావెల్‌ను అందిస్తాయి. వెనుక లింకేజ్ టైప్ మోనోషాక్ 180 మిల్లీమీటర్ల ట్రావెల్ ఇస్తుంది. ముందు 21 అంగుళాలు, వెనుక 17 అంగుళాల వైర్-స్పోక్ వీల్స్ ఉన్నాయి. హిమాలయన్ 440లో 220 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్ ఉంది. సీటు ఎత్తు 800 మిల్లీమీటర్లు. ముందు 300 మిల్లీమీటర్ల డిస్క్, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేకులు ఉన్నాయి. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్ స్టాండర్డ్‌గా ఇచ్చారు. ఆఫ్-రోడ్ రైడింగ్ కోసం ఏబీఎస్‌ను వెనుక చక్రానికి ఆఫ్ చేసుకునే అవకాశం ఉంది. ఫీచర్ల విషయానికొస్తే ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, డిజిటల్-అనలాగ్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ట్రిప్పర్ నావిగేషన్, యూఎస్‌బీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్ ఉన్నాయి. 15 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్ ఇచ్చారు. టూరింగ్ కోసం లగేజీ తీసుకెళ్లే సదుపాయాన్ని కూడా మెరుగుపరిచారు.



సెలా బ్లాక్, మస్టాంగ్ బ్రౌన్, నెలాంగ్ వైట్ రంగుల్లో బైక్ లభిస్తుంది. తొలుత విక్రయించే బైక్‌లపై 10వ వార్షికోత్సవ ప్రత్యేక బ్యాడ్జ్ ఉంటుంది. సెప్టెంబర్ 4 నుంచి బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ డీలర్‌షిప్‌లతో పాటు కంపెనీ వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవచ్చు.

## ఇంత సింపుల్‌గా ఉంటారా? యాపిల్ కొత్త సీఈఓ సోషల్ మీడియా ఖాతా చూసి నెటిజన్ల షాక్!

ప్రపంచంలోని దిగ్గజ టెక్ కంపెనీకి అధిపతి అంటే.. ఆయన సోషల్ మీడియా ప్రొఫైల్ కూడా అదే స్థాయిలో హంగులతో ఉంటుందని అనుకుంటాం కదా! హోదా, ఘనతలు, సాధించిన విజయాలు.. ఇలా ఎన్నో వివరాలు కనిపిస్తాయని ఊహిస్తాం. కానీ, యాపిల్ కొత్త సీఈఓ జాన్ టెర్నస్ లింక్డ్ఇన్ ప్రొఫైల్ మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. సీఈవోగా బాధ్యతలు చేపట్టి రోజులు గడుస్తున్నా.. ప్రొఫైల్‌లో ఇంకా పాత హోదానే కనిపిస్తోంది. పైగా తన గురించి చెప్పుకునే వివరాలు కూడా చాలా తక్కువ. దీంతో టెర్నస్ ప్రొఫైల్ ఇప్పుడు నెటిజన్లలో ఆసక్తికర చర్చకు దారితీసింది. జాన్ టెర్నస్ సెప్టెంబర్ 1న యాపిల్ సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. టిమ్ కుక్ స్థానంలో ఆయన పగ్గాలు అందుకున్నారు. 25 ఏళ్లకు పైగా యాపిల్‌లో పనిచేసిన టెర్నస్.. కంపెనీలో కీలక హోదాల్లో కొనసాగారు. అయినా ఆయన లింక్డ్ఇన్ ఖాతా మాత్రం ఇంకా పాత హోదానే చూపిస్తోంది. ప్రొఫైల్‌లో యాపిల్‌లో పనిచేస్తున్నట్లు ఉంది. అయితే సీఈవోగా కొత్త హోదాను ఇంకా చేర్చలేదు. గతంలో వర్చువల్ రీసెర్చ్ సంస్థలో ఇంజినీర్‌గా నాలుగేళ్లు పనిచేసిన విషయాన్ని కూడా పేర్కొన్నారు. పెన్సిల్వేనియా



యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ చదివినట్లు వివరించారు.

## శ్రీచరణి కేక.. 55 పరుగులకే కుప్పకూలిన పాకిస్థాన్

మహిళల ఆసియా కప్ 2026లో భారత మహిళల జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో గ్రూప్-ఏ మ్యాచ్‌లో బౌలర్లు విశ్వరూపం ప్రదర్శించడంతో పాక్ జట్టు కేవలం 55 పరుగులకే ఆలౌట్ అయింది. భారత స్పిన్నర్ల ధాటికి పాక్ బ్యాటర్లు కనీస ప్రతిఘటన కూడా చూపలేక పెవిలియన్‌కు క్యూ కట్టారు. ముఖ్యంగా, తెలుగమ్మాయి శ్రీచరణి ధాటికి పాక్ టాపార్డర్ విలవిల్లాడింది. శ్రీచరణి తన మొదటి స్పెల్ లో కేవలం 3 పరుగులు ఇచ్చి 3 వికెట్లు నేలకూల్చింది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే, ఈ నిర్ణయం పూర్తిగా బెడిసికొట్టింది. ఆరంభం నుంచే భారత బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పాక్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. పవర్ ప్లే ముగిసేలోపే పాకిస్థాన్ కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ముఖ్యంగా భారత స్పిన్నర్లు శ్రీ చరణి, ప్రేమా రావత్ తమ మాయాజాలంతో పాక్ బ్యాటింగ్ ఆర్డర్‌ను ఛిన్నాభిన్నం చేశారు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి తన 4 ఓవర్లలో కేవలం 7 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, లెగ్ స్పిన్నర్ ప్రేమా రావత్ కూడా 9 పరుగులిచ్చి 3 వికెట్లతో సత్తా చాటింది. వీరికి దీప్తి శర్మ (2/5) తోడవడంతో పాకిస్థాన్ ఇన్నింగ్స్ 18.1 ఓవర్లలోనే 55 పరుగుల వద్ద ముగిసింది. పాక్ జట్టులో షవాల్ జుల్ఫికర్ చేసిన 14 పరుగులే



అత్యధిక స్కోరు కావడం వారి బ్యాటింగ్ వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఫలితంగా, ఈ మ్యాచ్‌లో విజయం సాధించడానికి భారత జట్టు ముందు 56 పరుగుల అత్యంత సులభమైన లక్ష్యం నిలిచింది.

## టెస్టుల్లో లాగా చెలరేగాలంటే.. పంత్‌కు రైనా కీలక సలహా

టీమిండియా వికెట్ కీపర్-బ్యాటర్ రిషభ్ పంత్ టెస్టు క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్నప్పటికీ, పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో మాత్రం అదే స్థాయి ప్రదర్శన చేయలేకపోతున్నాడు. దీనిపై భారత మాజీ బ్యాటర్ సురేశ్ రైనా స్పందించాడు. పంత్‌లో అపారమైన ప్రతిభ ఉందని, మానసిక అడ్డంకులను అధిగమించి, ఎలాంటి సంకోచం లేకుండా ఆడితే వైట్ బాల్ క్రికెట్‌లోనూ టెస్టు ఫామ్‌ను పునరావృతం చేయగలడని రైనా విశ్వాసం వ్యక్తం చేశాడు. టెస్టుల్లో మ్యాచ్ విన్నర్‌గా పేరు తెచ్చుకున్నప్పటికీ, పంత్ వన్డేలు, టీ20ల్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోలేకపోయాడు. అతను ఇప్పటివరకు 31 వన్డేలు, 76 టీ20లు ఆడాడు. చివరిసారిగా 2024లో భారత జట్టు తరఫున వైట్ బాల్ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన జట్టులో ఉన్నా, తుది జట్టులో అవకాశం రాలేదు. ఈ ఏడాది జూన్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన సిరీస్‌కు వన్డే జట్టు నుంచి కూడా అతడిని తప్పించారు. ఆకాశ్ చోప్రా యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ రైనా ఈ వ్యాఖ్యలు చేశాడు. “పంత్ నా ఫేవరెట్ ప్లేయర్. అతను టెస్టుల్లో అద్భుతంగా ఆడుతూ భారీ స్కోర్లు చేస్తున్నాడు. జట్టులో ధ్రువ్ జురెల్, సంజూ శాంసన్ వంటి వారు ఉన్నా, పంత్‌లో ఒక ప్రత్యేకమైన ఎక్స్-ఫ్యాక్టర్ ఉంది. అతను



నెమ్మదిగా పరిణతి చెందుతున్నాడు” అని రైనా పేర్కొన్నాడు. అయితే టెస్టుల్లో రాణించినట్లుగా వన్డే, టీ20ల్లో ఎందుకు రాణించలేకపోతున్నాడనేది ప్రశ్నార్థకమని రైనా అన్నాడు. “అతని మదిలో ఏదైనా ఆలోచన ఉందా? అదేంటో అతను తెలుసుకోవాలి. టెస్టుల్లో అయితే ఎలాంటి సంకోచం లేకుండా తొలి బంతికే సిక్స్ కొట్టడానికి కూడా వెనుకాడడు. కానీ వైట్ బాల్ క్రికెట్‌లో ఇన్నింగ్స్‌ను ఎలా నడిపించాలో అతను ఆలోచించుకోవాలి” అని రైనా విశ్లేషించాడు. కొన్నిసార్లు ఆటగాడికి ఒకరకమైన మానసిక అడ్డంకి ఏర్పడుతుంది. దాన్ని అధిగమించడానికి సరైన మార్గనిర్దేశం చేసే వారితో సమయం గడపాలి. పంత్ తన సహజ శైలిలో స్వేచ్ఛగా ఆడాలి. అతను ఎంతో సాధించగలడు. గతంలో అతను ఎదుర్కొన్న గడ్డు పరిస్థితుల (యాక్సిడెంట్) దృష్ట్యా, దేవుడి దయతో భవిష్యత్తులో తప్పకుండా రాణిస్తాడు. అతని సమయం వస్తుంది” అని రైనా ఆశాభావం వ్యక్తం చేశాడు.

# స్పోర్ట్స్

## ఇది రాజకీయాలకు అతీతం, మానవత్వంతో చూడండి!.. ఇమ్రాన్ ఖాన్‌కు అండగా బ్రయాన్ లారా




పాకిస్థాన్ మాజీ కెప్టెన్, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితం, ఆయన ఆరోగ్యంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ జాబితాలో తాజాగా వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం బ్రయాన్ లారా కూడా చేరాడు. జైల్లో ఉన్న ఇమ్రాన్‌కు గౌరవప్రదమైన, స్వతంత్ర వైద్య సంరక్షణ అందించాలని లారా డిమాండ్ చేశాడు. ఈ విషయంపై ఇప్పటికే గళం విప్పిన అంతర్జాతీయ మాజీ కెప్టెన్లకు తాను అండగా నిలుస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. “మైదానంలో ఇమ్రాన్ ఖాన్, నేను కొన్నిసార్లు మాత్రమే తలపడ్డాం. కానీ ఆయనపై నాకు కలిగిన గౌరవం తక్షణమే ఏర్పడి, శాశ్వతంగా నిలిచిపోయింది” అని లారా తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో రాశాడు. “ఒకప్పుడు తన దేశానికి ఆశాజ్యోతిగా, గర్వకారణంగా, స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన వ్యక్తి, ఇప్పుడు కనీస గౌరవం, కరుణకు నోచుకోని పరిస్థితుల్లో ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. ప్రతీ మనిషికి తగిన గౌరవంతో పాటు, సరైన వైద్య సంరక్షణ ఆయనకు అందాలని కోరుతున్న తోటి మాజీ కెప్టెన్లతో నేను ఏకీభవిస్తున్నాను. ఇది రాజకీయాలకు సంబంధించిన విషయం కాదు. మన క్రీడారంగంలోని ఒక దిగ్గజానికి చూపించాల్సిన కనీస మానవత్వం” అని లారా తన ఆవేదనను వ్యక్తం చేశాడు. ఇటీవల గ్రెగ్ చాపెల్, పాట్ కమిన్స్, జావేద్ మియాందాద్, కపిల్ దేవ్ వంటి ప్రముఖులు ఇమ్రాన్ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేసిన కొద్ది రోజులకే లారా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతకుముందు, 1992 ప్రపంచ కప్ విజేత అయిన ఇమ్రాన్‌కు గౌరవప్రదమైన చికిత్స అందించాలని, కోర్టు ఆదేశించిన వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ 21 మంది అంతర్జాతీయ మాజీ కెప్టెన్లు ఒక పిటిషన్‌పై సంతకాలు చేశారు.

## ‘ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు’

# తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్




‘ఆ నలుగురు’, ‘అందరి బంధువయా’ వంటి హృద్యమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న విలక్షణ దర్శకుడు చంద్ర సిద్దార్థ్, మరో విభిన్నమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో, ఫిల్మోత్సవ్ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం.. “ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు”. భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్‌గా నిలుస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 18న విడుదల కానుంది. ఈ చిత్రం ఒక హై-కాన్సెప్ట్ సైకలాజికల్ మిస్టరీ మ్యూజికల్ మూవీగా రూపుదిద్దుకుంది. దివంగత ప్రముఖ రచయిత, దర్శకుడు మదన్ అందించిన కథతో ఈ సినిమాను చంద్ర సిద్దార్థ్ తెరకెక్కించారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ‘ఆ నలుగురు’ క్లాసిక్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. సౌండ్ థెరపీ, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, అపరాధ భావన వంటి అంశాలను కథలో కీలక మలుపులుగా చూపిస్తూ, సంగీతం-మానవ మెదడు మధ్య ఉన్న సంబంధాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు చంద్ర సిద్దార్థ్ మాట్లాడుతూ, “ఈ కథ నా స్నేహితుడైన మదన్‌తో కలిసి చేయాలనుకున్న ప్రాజెక్ట్. ఇది ఆయన చివరిగా ప్లాన్ చేసిన సినిమా. ప్రతిరోజూ రాత్రి 10:30 గంటలకు ఒక రేడియో స్టేషన్ నుంచి ఒకే పాట ప్రసారమవుతుంది. ఆ పాటను నెమలిపాలెం నుంచి కొందరు వ్యక్తులు కోరుతుంటారు. అదే ఈ సినిమా టైటిల్ వెనుక ఉన్న రహస్యం. ధ్వని, న్యూరోసైన్స్, ప్రేమ వంటి అంశాలతో ముడిపడిన ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. ఇది ఒక ప్రయోగాత్మక ప్రయత్నం” అని వివరించారు. ఈ చిత్రంలో హర్ష హీరోగా పరిచయం అవుతుండగా, అమైరా గోస్వామి, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ, అశోక్‌వర్ధన్, రేఖా నిరోషా కీలక పాత్రలు పోషించారు. జే రెక్స్ సంగీతం అందించిన ఈ చిత్రంలో నాలుగు పాటలు ఉన్నాయి. మానవ సంబంధాలను సున్నితంగా ఆవిష్కరించే చంద్ర సిద్దార్థ్, ఈసారి ఒక ఆధునిక థ్రిల్లర్‌తో ఎలాంటి మ్యాజిక్ చేస్తారోనని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.




## ‘అదే నిజమైన విద్య’.. టీచర్స్ డేపై రామ్‌గోపాల్ వర్మ సంచలన వ్యాఖ్యలు!

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఎవరికీ ‘హ్యాపీ టీచర్స్ డే’ చెప్పడం లేదన్నారు. నిజమైన వ్యక్తి ఎప్పుడూ తనకు బోధించడాన్ని ప్రశ్నిస్తాడని అన్నారు. టీచర్ చెప్పింది గుడ్డిగా నేర్చుకోవడం విద్య కాదని వ్యాఖ్యానించారు. ‘బోధన’ పేరుతో విద్యార్థులను ఒకే దారిలో నడిపించడం సరికాదని వర్మ అభిప్రాయపడ్డారు. టీచర్ చెప్పేది తప్పని, కాలం చెల్లినదని విద్యార్థి గుర్తించినప్పుడే నిజమైన అభ్యాసం మొదలవుతుందని పేర్కొన్నారు. తన వాదనకు ఐన్‌స్టీన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్ ఉదాహరణలను వర్మ ప్రస్తావించారు. ప్రష్యన్ పాఠశాల విధానాన్ని ఐన్‌స్టీన్ ఇష్టపడలేదని చెప్పారు. అయినా తర్వాత సాపేక్ష సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని పేర్కొన్నారు. స్పీల్‌బర్గ్‌కు ఫిల్మ్ స్కూల్‌లో ప్రవేశం నిరాకరించారని, అయినా ప్రపంచ ప్రఖ్యాత దర్శకుడిగా ఎదిగారని తెలిపారు. సిలబస్‌ను అనుసరించకుండా ముందుకు వెళ్లిన వారే కొత్త మార్గాలు చూపారని అన్నారు. విజయవంతమైన ఇంజినీర్లు, వైద్యులు, న్యాయవాదులను చూశానని.. కానీ విజయవంతమైన టీచర్‌ను చూడలేదని వర్మ వ్యాఖ్యానించారు. “నిజమైన అభ్యాసం అంటే టీచర్ నేర్పించాలనుకున్న దాన్ని కూడా అవసరమైతే మర్చిపోవడం” అని అన్నారు. టీచర్లు విద్యార్థులను స్వతంత్రంగా ఆలోచించే నాయకులుగా కాకుండా అనుచరులుగా తయారు చేస్తున్నారని విమర్శించారు. పిల్లలను టీచర్ల వద్దకు పంపే తల్లిదండ్రులు తెలియకుండానే వారి స్వతంత్ర ఆలోచనా శక్తిని దెబ్బతీస్తున్నారని అన్నారు. జార్జ్ బెర్నార్డ్ షా, ఆస్కార్ వైల్డ్ వ్యాఖ్యలను కూడా వర్మ ప్రస్తావించారు. చివరగా తన అభిప్రాయానికి కొనసాగింపుగా “అందుకే మీకు ‘హ్యాపీ టీచర్స్ డే’ చెప్పాలని అనుకోవడం లేదు” అని పేర్కొన్నారు.



# నాని సినీ ప్రయాణానికి 18 ఏళ్లు

# ఫ్యాన్స్‌కు నేచురల్ స్టార్ స్వీట్ మెసేజ్

హీరో నాని సినీ ప్రయాణం 18 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా అభిమానులు, ప్రేక్షకులకు అతడు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపాడు. వారి ప్రేమను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదని చెప్పారు. ఇకపై కూడా అలా చేయబోనని స్పష్టం చేశాడు. “18 ఏళ్లు.. అధికారికంగా సినిమాల్లో పెద్దవాడినయ్యా” అంటూ నాని ‘ఎక్స్’లో పోస్టు చేశాడు. “మీ ప్రేమను ఎప్పుడూ తేలిగ్గా తీసుకోలేదు.. ఇకపై కూడా తీసుకోబోను” అని రాసుకొచ్చాడు. నాని హీరోగా పరిచయమైన తొలి చిత్రం ‘అష్టా చమ్మా’. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 2008 సెప్టెంబర్ 5న విడుదలైంది. అప్పటి నుంచి నటుడిగా మొదలైన నాని ప్రస్థానం హీరోగా, నిర్మాతగా ఎదిగే స్థాయికి చేరింది. ప్రస్తుతం నాని శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘ది ప్యారడైజ్’లో నటిస్తున్నాడు. ఎస్ఎల్‌వీ సినిమాస్ నిర్మిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలుత మార్చి 26న విడుదల చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత ఆగస్టు 21కి మార్చారు. చివరగా సెప్టెంబర్ 24కు వాయిదా వేశారు. ఇటీవల విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. రక్తంతో తడిసిన లుక్‌లో నాని కనిపించడం అభిమానుల్లో ఆసక్తి పెంచింది. రెండు జడలతో కనిపిస్తూ.. చేతిలో బ్లేడ్‌లతో చేసిన గొలుసుతో నాని కనిపించే సన్నివేశాలు టీజర్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అణచివేతకు గురైన ప్రజలు తిరుగుబాటు చేయడం చుట్టూ కథ సాగుతుందనే సంకేతాలు టీజర్ ఇచ్చింది. ఇందులో మోహన్‌బాబు ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు. “ఈ దేశం ఎవరిది? మనది” అనే డైలాగ్‌లు టీజర్‌లో వినిపించాయి. ‘ది ప్యారడైజ్’ హిందీ, తెలుగు, తమిళం, ఇంగ్లిష్, స్పానిష్, బెంగాలీ, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల కానుంది.



PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.